రేపు జిల్లాస్థాయి స్పందన రద్దు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 13న సోమవారం జరగబోయే స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల కారణంగా ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి మున్సిపల్ కార్యాలయాలు, 20 మండలాల్లో స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

దిగువ కేంద్రాల్లో యథావిధిగా స్పందన

జిల్లాలోని నూజివీడు ఆర్‌డిఒ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు, ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి, కైకలూరు మండల కార్యాలయాల్లో ఈ నెల 13న సోమవారం స్పందన కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దగ్గు, జలుబు.. జనంలో గుబులు..!

వైరస్‌లే కారణమని సర్వత్రా ఆందోళన

ఆసుపత్రులకు క్యూ కడుతున్న వైనం

సూచనలు చేయని వైద్యఆరోగ్య శాఖాధికారులు



ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలు జలుబు, దగ్గు, జ్వరాలతో మూలుగుతున్నారు. రాత్రివేళల్లో చలి తీవ్రత పూర్తిగా తగ్గకపోయినా పగటి వేళల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీనికితోడు రెండు రోజులపాటు పగటి వేళల్లో ఎండ తీవ్రత తగ్గి కొన్ని గంటలపాటు మబ్బులు కమ్ముకోవడం అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఈ వాతావరణ మార్పులతో జనం మంచమెక్కుతున్నారు. ప్రధానంగా జలుబు, దగ్గుతోపాటు జ్వరం వస్తుండటంతో జనం ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. కరోనా తగ్గుముఖం పట్టిందనుకున్న తరుణంలో ఇప్పటికే గుండెపోట్లు పెరిగి హఠాన్మరణాలు సంభవించడం, తాజాగా జలుబు తీవ్రత పెరిగి రోజులు తరబడి తగ్గకపోవడం జనాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ క్రమంలోనే రకారకాల వైరస్‌లు ప్రబలుతున్నాయనే వార్తలతో జనం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో కొద్దిపాటి జలుబు చేసి అస్వస్థతకు గురైనా వెనువెంటనే ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. అప్రమత్తతను అంతా స్వాగతించాల్సిందే. అయితే వైరస్ కారణంగానే జనం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారనేది బహిరంగ రహస్యం. దీంతో ప్రయివేటు ఆసుపత్రులు దగ్గును బూచిగా చూపి రకరకాల పరీక్షల పేరుతో వేలకువేలు గుంజేస్తూ ఆపై సాధారణ సమస్యేనంటూ మందులిచ్చి పంపుతున్నారు. దీంతో పేద ప్రజలు చేతి చమురు వదిలించుకుని ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక పిల్లల విషయంలో అయితే శ్వాసపరమైన సమస్యల పేరిట ఇన్‌పేషెంట్లుగా చేర్చుతున్నారు. దీనికి రోజుకు వేలల్లోనే వసూలు చేస్తున్నారు. పరిస్థితి ఇంత దయనీయంగా ఉన్నా జిల్లా అధికారులు ప్రత్యేకంగా వైద్య ఆరోగ్య శాఖాధికారులు జనం ఆరోగ్య పరిస్థితులపై స్పందించడంగాని, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారంగాని చేపట్టకపోవడం అందరినీ ఆవేదనకు గురిచేస్తోంది. ప్రధానంగా సాధారణ జలుబు, దగ్గు ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రచారం చేయడంతోపాటు ఇతర సమస్యలుంటే స్థానిక పిహెచ్‌సిల్లో వైద్యాధికారులు మెరుగైన చికిత్స అందించేలా చర్యలు చేపట్టడం చాలా అవసరం. అలాగే వైరస్‌లు ప్రబలుతున్నాయనే వార్తల నేపథ్యంలో వైద్యఆరోగ్య శాఖ పరంగా తీసుకుంటున్న చర్యలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ముందస్తుగా ప్రచారం చేస్తే జనంలో ఆందోళన తొలగుతుంది. అలాకాకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే జిల్లా ప్రజలు ఆందోళనతో ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించి వేలకు వేలు సొమ్ము వెచ్చించాల్సిన దుస్థితి దాపురిస్తోంది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల హడావుడిలో మునిగిన జిల్లా అధికారులు వెంటనే స్పందించి వైద్యఆరోగ్య శాఖను కార్యాచరణకు దింపాల్సి ఉంది. లేనిపక్షంలో ప్రధానంగా విద్యార్థులకు పరీక్షల సీజన్ కావడంతో వారు లేనిపోని ఆందోళనలు, అనారోగ్యాలతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. దీనిపై రెండు జిల్లాల అధికారులు తక్షణం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఫైర్ డిజి సునీల్‌కుమార్

జిల్లా ఫైరాఫీసర్‌తో మాట్లాడుతున్న డిజి సునీల్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

వేసవిలో అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ డైరెక్టర్ జనరల్ పివి.సునీల్‌కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలో అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. జిల్లాలో సమస్యలపై జిల్లా అగ్నిమాపక శాఖాధికారి మాల్యాద్రిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది, వాహనాల కొరతపై చర్చించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ చింతలపూడి, జంగారెడ్డిగూడెంలలో నూతన వాహనాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. అగ్నిప్రమాదాలు సకాలంలో నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఉగాదికి నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలి

ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ గృహనిర్మాణ శాఖాధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో శనివారం పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ప్రగతిలో వెనుకబడి ఉన్న మండలాల అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ నవరత్నాలు కార్యక్రమంలో పేదలందరికీ ఇళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాన్ని లబ్ధిదారులకు తెలియజేసి ఇళ్ల నిర్మాణ ప్రగతిని మరింత పెంచాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వంతో నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని నూజివీడు, మండవిల్లి, ఆగిరిపల్లి, కలిదిండి, కైకలూరు మండలాల్లో పేదలందరికీ ఇళ్ల పథకం ప్రగతి తక్కువగా ఉందని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని అన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎవిఎన్‌ఎస్.మూర్తి, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్, ఆయా మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, గృహనిర్మాణ శాఖాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థిని

చేతిరాత పోటీల్లో చైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

జాతీయస్థాయి చేతిరాత పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ చాటినట్లు చింతలపూడి శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ సత్యనారాయణ అన్నారు. పట్టణంలో జనవరి 23న 'జాతీయ చేతరాత దినోత్సవం' పురస్కరించుకుని నిర్వహించిన జాతీయస్థాయి చేతిరాత పోటీల్లో సౌత్ ఇండియా లెవెల్‌లో స్థానిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు తొమ్మిదో తరగతికి చెందిన గొట్టుముక్కల అమృత సాయి, రాష్ట్రస్థాయిలో తొమ్మిదో తరగతికి చెందిన జలాడి చంద్రిక, జిల్లా స్థాయిలో ఏడో తరగతి చెందిన ఆకుల వాణి హాసిని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ ముగ్గురికి రాష్ట్ర మధ్యాహ్నం భోజన పథకం డైరెక్టర్ మీనా సర్టిఫికెట్లను అందించి అభినందించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాం

ఎంఎల్‌ఎ డిఎన్ఆర్

ప్రజాశక్తి - కైకలూరు

మండలంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందించడంతోపాటు సమస్యలు తెలుసుకుని పరిష్కరించామని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మండలంలోని ఆలపాడు సచివాలయ పరిధిలో 187వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమేశ్వరం, బిసి కాలనీల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణ, ఎంపిపి అడవి వెంకట కృష్ణమోహన్, జెడ్‌పిటిసి సభ్యురాలు బేబీ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, వాలంటీర్లు పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా కేక్ కట్ చేశారు.



పరస్పరం కేక్ తినిపించుకుంటున్న ఎంఎల్‌ఎ, మాజీ ఎంఎల్‌ఎ

అగ్ని బాధితులకు మానవత సాయం

బాధితులకు పంపిణీ చేస్తున్న సామగ్రి

ప్రజాశక్తి - వేలేరుపాడు

మండలంలోని కన్నాయిగుట్ట గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులను మానవత స్వచ్ఛంద సంస్థ నేతలు, సిఐటియు నేతలు శనివారం పరామర్శించారు. కన్నాయిగుట్టలో నిరాశ్రయులైన 27 కుటుంబాలకు, టేకూరులోని మూడు కుటుంబాలకు నిత్యావసర సరుకులు, వివిధ రకాల ఇంటి వస్తువులు, దుప్పట్లు, దుస్తులు, ఒక్కో కుటుంబానికి రూ.500 చొప్పున నగదు అందించారు. ఈ సందర్భంగా మానవత జిల్లా అధ్యక్షులు ఆర్.గంగాధర్‌రావు మాట్లాడుతూ ప్రజలకు సహాయ పడాలనే దృక్పథంతో ఈ సంస్థను స్థాపించామని, సభ్యుల సహకారంతో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో. తహశీల్దార్ చల్లన్నదొర, సంస్థ జంగారెడ్డిగూడెం కోశాధికారి పి.వెంకటరెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, నాయకులు మడివి దుర్గారావు, సువ్వేటి లత, అక్కమ్మ, ఎంపిటిసి కె.రామలక్ష్మి, సర్పంచి ఎస్.విజయ, ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్, మానవత నేత అజయ్‌బాబు పాల్గొన్నారు.

ఇంటర్, టెన్త్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఏలూరు

ఇంటర్మీడియట్, ఎస్‌ఎస్‌సి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఇంటర్, ఎస్‌ఎస్‌సి పరీక్షల నిర్వహణపై శనివారం రాష్ట్ర సెక్రటేరియట్ నుండి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటర్, ఎస్‌ఎస్‌సి పరీక్షల నిర్వహణలో మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ పరీక్షలు ఈ నెల 15వ తేదీ నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగుతాయని, ఎస్‌ఎస్‌సి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుండి 18వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్ష ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఎస్.ఎస్.సి. పరీక్షలు ఉదయం 9. 30 ని.ల నుండి 11. 45 ని.ల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఇంటర్మీడియట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను 9 గంటల తరవాత, ఎస్.ఎస్.సి . పరీక్షలకు ఉదయం 9. 30 నిల తరవాత పరీక్షా కేంద్రంలోకి అనుమతించరన్నారు. పరీక్ష హాలులోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించకూడదన్నారు. ఇన్విజిలేటర్లు, పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది కూడా స్మార్ట్‌ఫోన్‌లను అనుమతించకూడదన్నారు. చీఫ్ ఇన్విజిలేటర్ వద్ద మాత్రం స్మార్ట్‌ఫోన్ కాకుండా ఫీచర్ ఫోన్‌ను మాత్రమే అనుమతిస్తారన్నారు. విద్యార్థినుల వద్ద సెల్‌ఫోన్లు తనిఖీ చేసేందుకు పరీక్షా కేంద్రాల వద్ద మహిళా పోలీసులను నియమించాలన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు, రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ ఫోన్ నెంబర్ 18004257635, జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ నెంబర్ 7032241842, 08812230197 నెంబర్లకు ఫోన్ చేసి ఏదైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. పరీక్షల నిర్వహణ అంతా సీసీ టీవీలతో పర్యవేక్షణ జరు గుతుందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద హెల్త్ క్యాంపును ఏర్పాటు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ విధిస్తారని, పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను పరీక్షల సమయంలో మూసివేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ప్రశ్నాపత్రాలు భద్రపర్చేందుకు, పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షల అనంతరం జవాబుపత్రాలను భద్రపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ నియమించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ, డిఇఒ రవిసాగర్, ఆర్‌ఐఒ చంద్రశేఖర్‌బాబు, డివిఇఒ ప్రభాకరరావు పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీ జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరించిన నేతలు

ప్రజాశక్తి - భీమడోలు

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం వ్యవసాయ, కార్మిక, రైతు, కౌలు రైతు, సిఐటియు ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కట్టా భాస్కరరావు, జి.ప్రసాదరావు, కౌలు రైతుసంఘం నాయకులు వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, సిఐటియు నాయకులు స్వర్ణకుమారి పాల్గొన్నారు.

దెందులూరు: కేంద్ర ప్రభుత్వ విధానాలతో వ్యవసాయరంగం సంక్షోభంలో ఉందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మండలంలోని ఉండ్రాజవరంలో ఆంజనేయస్వామి గుడి ఆవరణలో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతుల సమావేశం సంఘం మండల అధ్యక్షులు సున్నా వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి రైతుల పంట ఖర్చులను రెట్టింపు చేశారని విమర్శించారు. కౌలురైతుల రక్షణకు సమగ్ర చట్టం తీసుకొచ్చి కౌలురైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కొల్లి విజయభాస్కర్‌రెడ్డి, కరుబోతు రవికుమార్, కడగళ్ల దుర్గారావు, కంటిబోతు శ్రీనివాసరావు, కడగళ్ల సూర్యనారాయణ, సున్నా సాయి పాల్గొన్నారు.

ప్రచారం.. ఆందోళన..!

స్థానిక సంస్థల ఎంఎల్‌సి స్థానాలకు ముగిసిన ప్రచారం

డిమాండ్ల సాధనకు రోడ్డెక్కిన ఉద్యోగ, ఉపాధ్యాయులు



యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏలూరులో కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిలబడి ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

స్థానిక సంస్థల ఎంఎల్‌సి రెండు స్థానాల ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ఈ నెల 13న సోమవారం జరగనుంది. దీనికి సంబంధించి ప్రచారం ఇప్పటికే ముగిసింది. టిడిపి నేతలు స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా స్థానిక సంస్థల నిర్వీర్యం, నిధులు విడుదల చేయకపోవడం, గ్రాంట్లను సైతం మళ్లించడం వంటి అంశాలను ప్రధానంగా టిడిపి నేతలు ప్రచారం నిర్వహించారు. అయితే గెలుపోటములు ఎలాగున్నా వైసిపి ప్రభుత్వం తీరును స్థానిక ప్రజాప్రతినిధుల్లో మరోసారి ఎండగట్టడంలోనూ, వైసిపి అభ్యర్థులకు గుబులు పుట్టించడంలోనూ తాము విజయవంతమయ్యామని తెలుగు తమ్ముళ్లు చెబుతున్నారు. ఇక వైసిపి అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్ ప్రచారం నియోజకవర్గాలవారీ సాగింది. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన సమావేశాలకు హాజరై తమకు ఓటు వేయాల్సిన విధానం గురించి వివరించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ వ్యతిరేకత ఈ ఎన్నికలపై ప్రభావం చూపకుండా వైసిపి ఓట్లన్నీ తమకే పడేలా ఎంఎల్‌ఎలను రంగంలోకి దించారు. డెల్టాలో కొంచెం ధైర్యమున్నా మెట్ట ప్రాంతంలో ఎంఎల్‌ఎలు, ఎంపీల గ్రూపులు వేర్వేరుగా ఉండటం, ఇక్కడ పార్టీని ఏకతాటిపై నడిపించే నేత లేకపోవడంతో రాష్ట్ర నేతలను రంగంలోకి దించారు. దీనిలో భాగంగానే వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి ఏలూరు జిల్లా పరిధిలో పలు నియోజకవర్గాల్లో పర్యటించి ప్రచారం సాగించారు. పైగా కొన్ని కేంద్రాల్లో మాక్ పోలింగ్ కూడా నిర్వహించి స్థానిక ప్రజాప్రతినిధులు ఓటింగ్‌లో తడబాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ముందస్తు క్యాంపులు నిర్వహించాలనుకున్నా అధిష్టానం సూచనలతో ఆ ఆలోచనను విరమించుకున్నట్లు తెలిసింది. డివిజన్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించనుండడంతో మండలాలవారీ ఓటర్లను సకాలంలో అక్కడికి తీసుకొచ్చేందుకు, కొంత దూర ప్రాంతంలోని వారినైతే ఆదివారం ఉదయానికే ఆయా ప్రాంతాలకు రప్పించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. మొత్తానికి నల్లేరు మీద నడకలా సాగాల్సిన వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపు కత్తిమీద సాములా మారిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

సిపిఎస్ రద్దు, పాత బకాయిల జమ, పిఆర్‌సి ఏర్పాటు తదితర అంశాలపై ఎపి జెఎసి అమరావతి పిలుపు మేరకు ఈ నెల 9 నుంచి జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే సిపిఎస్ రద్దు, ఇతర హామీల కోసం ఉపాధ్యాయ సంఘాలు, ప్రధానంగా యుటిఎఫ్ వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గతం నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళనలకు మద్దతు పలుకుతున్న సిపిఎం, సిపిఐ తాజాగా ప్రత్యక్ష ఆందోళన చేపట్టాయి. అదే సమయంలో ఏలూరు, భీమవరంలోని కలెక్టరేట్లలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన బాట పట్టారు. ఇక ఏలూరు, భీమవరంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు విద్యారంగాన్ని పరిరక్షించాలని, ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఆందోళన బాట పట్టారు. మొత్తంగా ఇటు ఉద్యోగ, ఉపాధ్యాయులతోపాటు అటు వామపక్షాలు ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని, కక్షసాధింపు చర్యలు వీడాలని గొంతెత్తడం జిల్లాలోని ప్రజాప్రతినిధులకు సంకటంగా మారింది. ఇప్పటికే పలువురు ఎంఎల్‌ఎలు ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల తమ అధినేత తీరు సరికాదని, ఇది రానున్న ఎన్నికల్లో కొంపముంచే అవకాశం ఉందని వ్యాఖ్యానిస్తున్న నేపథ్యంలో ఇకనైనా ప్రభుత్వం తన తీరు మార్చుకుంటుందా, లేక అలానే తన దుందుడుకు వైఖరి కొనసాగించి నష్టపోతుందా అనేది వేచిచూడాలి.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

దారి తప్పిన జింక

క్షేమంగా అదుపులోకి తీసుకున్న వన్యప్రాణి సంరక్షణాధికారులు

అధికారుల సంరక్షణలో జింక

ప్రజాశక్తి - భీమడోలు

జింక దారి తప్పింది. కొల్లేరు అభయారణ్య పరిధిలోని లక్ష్మీపురం వద్ద గల వన్యప్రాణి సంరక్షణ శాఖ చెక్‌పోస్ట్ ప్రాంతంలోని ఆగడాలలంక ఛానల్‌లో జింకను గుర్తించారు. శనివారం సమాచారం అందుకున్న వన్యప్రాణి సంరక్షణ శాఖ సిబ్బంది దానిని కాపాడారు. ఆగడాలలంకకు చెందిన పశువైద్య సహాయకులు శ్రీనివాసరావు జింకకు తగిలిన గాయాలకు చికిత్స చేశారు. జింక ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. ఆపరేషన్ సేవ్ జింక కార్యక్రమాన్ని ఎఫ్ఆర్ఒ ఎస్‌విఆర్.కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఆయన తెలిపిన వివరాల మేరకు చెక్‌పోస్ట్ సిబ్బంది ఒకరు దెందులూరు మండలం నుంచి మురుగునీటిని కొల్లేరు సరస్సులోకి తరలించే కాలువ సమీప ప్రాంతంలో గల ఆగడాలలంక ఛానల్ నీటిలో ఒక జింక చిక్కుకొని ఉండటాన్ని గమనించారు. ఈ సమాచారాన్ని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ డి.సుజాత ద్వారా ఉన్నతాధికారులకు తెలియజేశారు. స్పందించిన ఎఫ్ఆర్ఒ స్వయంగా జింకను రక్షించేందుకు రంగంలోకి దిగారు. ఛానల్‌లో చిక్కుకున్న జింకను వలల సహాయంతో పట్టుకున్నారు. దానిని లక్ష్మీపురం చెక్‌పోస్ట్ వద్దకు తీసుకొచ్చి ఆగడాలలంక వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనివాసరావుచే చికిత్స చేయించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఒ మాట్లాడుతూ పట్టుబడిన జింక వేసవి సమయంలో మెట్ట ప్రాంతం నుంచి మేత కోసం కొల్లేరు ప్రాంతానికి వచ్చే గొర్రెల మందతో కలిసి ఇక్కడికి చేరుకుని ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. చెక్‌పోస్ట్ సమీపంలో గొర్రెలను కొల్లేరు ప్రాంతానికి తరలించే సమయంలో అప్పటికే గొర్రెలతో కలిసిపోయిన జింకను కాపరులు గమనించి దాన్ని ఆగడాలలంక ఛానల్‌లోకి వదిలేసి ఉండొచ్చన్నారు. జింక అటవీ ప్రాంతం నుంచి వచ్చింది కాదని, జనావాసాల నుంచి వచ్చింది కావొచ్చన్నారు. జింకకు పూర్తిస్థాయి చికిత్స అనంతరం జాతీయ పార్కుకు తరలించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్యప్రాణి సంరక్షణ శాఖ సిబ్బంది డి.శ్రీను, కృష్ణ, బాలాజీ, విఆర్ఒ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - నిడమర్రు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ ఐదో తేదీన నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో పిల్ల హరికుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించన సమావేశంలో సిఐటియు ఉపాధ్యక్షులు, నారపల్లి రమణరావు మాట్లాడారు. కార్మికులకు కనీస వేతన చట్టాలు అమలు చేయకుండా పోరాటాలకు, హక్కులకు భంగం కలిగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. రైతు సంఘం నాయకులు కోన శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. స్కీమ్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు దేవుని విజయలక్ష్మి మాట్లాడుతూ చలో ఢిల్లీ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు వరప్రసాద్, సంకెళ్ల మోహనరావు, చోడగిరి శివకృష్ణ, మల్లీశ్వరి, పద్మావతి పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు కోరుతూ ఆందోళన

ఏలూరు టౌన్ : అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దు చేస్తామని చెప్పిన జగన్ ముఖ్యమంత్రి అయి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా ఆ హామీని అమలు చేయకపోవడం చాలా అన్యాయమని ఎఐటియుసి ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. స్థానిక కోటదిబ్బ వద్ద ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘం ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏలూరు కార్పొరేషన్ ఉద్యోగ సిబ్బంది శనివారం ఉదయం మస్తారు సమయంలో ఆందోళన చేపట్టారు. ఆందోళన కార్యక్రమానికి జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు అధ్యక్షత వహించారు.

వణుదుర్రులో రోడ్లు నిర్మించాలి : వ్యకాస

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వణుదుర్రు దళితవాడలో సీసీ రోడ్లు నిర్మించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ కోరారు. శనివారం ఆయన ముదినేపల్లిలో మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా వణుదుర్రు దళితవాడలో ప్రధాన రహదారిలో సిసి రోడ్లు నిర్మాణం జరగలేదన్నారు. గుంతల రోడ్లపై ప్రజ లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధ్వానంగా ఉన్న రోడ్లపై ప్రయా ణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రోడ్ల విషయమై పలుమార్లు గ్రామ పంచా యతీ పాలక వర్గానికి, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వేసవిలోనైనా దళితవాడకు సీసీ రోడ్ల నిర్మించాలని కోరారు.

విద్యార్థులతో ప్రయాణించిన ఎంఎల్ఎ కొఠారు

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు కొత్త బస్టాండ్‌లో తమ ఊరికి వెళ్లాల్సిన బస్సును రద్దు చేయడంతో చల్ల చింతలపూడికి చెందిన విద్యార్థులు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరికి ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన ఆయన హుటాహుటిన ఏలూరు కొత్త బస్టాండుకు చేరుకొని సంబంధిత ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి వెంటనే మరొక బస్సును ఏర్పాటు చేయించారు. అంతే కాకుండా విద్యార్థులతో పాటే చల్ల చింతలపూడి వరకూ ప్రయాణించి వారిని క్షేమంగా ఇళ్లకు పంపించారు.

నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - కైకలూరు

నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పలువురు వైద్యులు తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ భవనంలో శనివారం సీతనపల్లి, కొల్లేటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, వైద్య సిబ్బందికి వైద్యులు ఎల్.కిరణ్, అన్నపూర్ణ అవగాహన కల్పించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన ట్రస్టుకు కృష్ణాజిల్లా బావదేవరపల్లి వాస్తవ్యులు పి.శివగణేష్‌బాబు శనివారం రూ.1,00,116 విరాళం దేవస్థానం ఎఇఒ మెట్టపల్లి దుర్గారావుకు అందించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు అన్నదానం బాండ్ పేపర్ అందించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

సమాజంలో ప్రతిఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని పోలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గన్నిన సురేంద్రనాథ్‌చౌదరి అన్నారు. బండివారిగూడెం పంచాయతీలోని నాయకులగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సురేంద్ర సోదరుడు గన్నిన లక్ష్మణరావు జ్ఞాపకార్థం చిన్నారులు కూర్చోవడానికి 30 కుర్చీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అప్పల రాజుగూడెంలో మూడు అంగన్‌వాడీ సెంటర్లకు కూడా కుర్చీలు అందించామన్నారు.

సిహెచ్‌సిలో మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను మరింత పెంచాలని జనసేన మండల అధ్యక్షులు గునపర్తి వీర వెంకట సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆ వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు, సదుపాయాల కల్పన గురించి ఆయన శనివారం అడిగి తెలుసుకున్నారు. వైరల్ ఫీవర్లు ఎక్కువగా ఉండటంతో గ్రామాల వారీగా ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ వైద్యాధికారి గెడ్డం జ్యోతిని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటి కోఆర్డినేటర్ ఆటపాకల వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు తెలగం శెట్టి రాంప్రసాద్, కార్యదర్శి కసుమద్దుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన అన్నదానం

ఆగిరిపల్లి : అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పదని, అటువంటి అన్నదాన కార్యక్రమాన్ని గత 38 వారాలుగా ఉదయగిరి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించటం ఎంతో అభినందనీయమని ఆగిరిపల్లి ఎస్ఐ ఎస్.చంటిబాబు అన్నారు. ఉదయగిరి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఆగిరిపల్లి బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉదయగిరి కృపారావు, మాదిగ రాజకీయ పోరాటసమితి రాష్ట్ర ఇన్‌ఛార్జ్ కె.ప్రదీప్, దళిత బహుజన గిరిజన హక్కుల దండోరా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కె.సురేషుబాబు, నెరుసు రాజేష్, ట్రస్టు సభ్యులు వి.రాజారావు, పి.కిరణ్, కె.బోజ్, ఆగిరిపల్లి, పట్టిగుడిపాడు గ్రామ ప్రముఖులు సిహెచ్.విక్టర్‌బాబు, వి.ప్రకాష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భీమడోలు

శ్రీని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద 216ఎ జాతీయ రహదారి వద్ద శనివారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మృతుడు పోలసానిపల్లి గ్రామానికి చెందిన సవలం సత్యనారాయణ(35) పోలీసులు గుర్తించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... సవలం సత్యనారాయణ భీమడోలు నుంచి పూళ్ల వెళ్లే మార్గం మధ్యలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయం వద్ద తన మోటార్‌సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

అక్రమంగా తెలంగాణకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండలంలోని గొల్లపల్లి వద్ద సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి రెండు లారీల్లో తరలిస్తున్న 43 టన్నుల నూకలు చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. లారీని సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దాడిలో సిఐఎస్ డిటి వెంకటేశ్వరరావు, వికాస్‌రెడ్డి, వీరయ్య పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

ముసునూరు : మంటల్లో గడ్డివామి దగ్ధమైన ఘటన మండలంలోని గోపవరం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గోపవరం గ్రామానికి చెందిన పుట్టి లక్ష్మణరావుకు చెందిన ఐదు ఎకరాల గడ్డివామి శనివారం మధ్యాహ్నం సమయంలో మంటల్లో దగ్ధమైంది. సుమారు రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు వీఆర్‌ఓ శ్రీనివాస్ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆదర్శప్రాయులు పివి.సునీల్‌కుమార్ : ఎయిమ్

ప్రజాశక్తి - చింతలపూడి

నేటి యువతకు రాష్ట్ర ఫైర్ శాఖ డిజిపి, రాష్ట్ర విపత్తుల విభాగం అధికారి పివి.సునీల్‌కుమార్ ఆదర్శనీయమని ఎయిమ్ రాష్ట్ర నాయకులు ఎన్ఎస్.రాజేంద్ర అన్నారు. ఫైర్ శాఖ డిజిపి, రాష్ట్ర విపత్తుల విభాగం అధికారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి పివి.సునీల్‌కుమార్ చింతలపూడి విచ్చేచారు. ఈ సందర్భంగా పివి.సునీల్‌కుమార్‌ను చింతలపూడి నియోజకవర్గ నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఎన్ఎస్.రాజేంద్ర మాట్లాడుతూ పివి.సునీల్‌కుమార్ ఉన్నతస్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చారన్నారు. పివి.సునీల్‌కుమార్‌ను ఎయిమ్ జిల్లా నాయకులు బోడా ఆనంద్, కాకర్ల సత్యం, చింతలపూడి గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలీప్, వైసిపి మండల యువత అధ్యక్షులు వెంపా కృష్ణ, యండపల్లి సర్పంచి యడ్ల మోహన్, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు కాంతారావు, దళిత నాయకులు నాగేశ్వరరావు, గోందిరాజు, బుచ్చిబాబు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అప్పారావు, రాష్ట్ర కౌన్సిలర్ పూరేటి శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో మెడల్స్ సాధించిన భార్గవిని, కోచ్ సూరిబాబును అభినంధించారు. ఈ కార్యక్రమంలో అవినాష్, చార్లెస్ వెంకన్నబాబు పాల్గొన్నారు.


సునీల్‌కుమార్‌ను సత్కరిస్తున్న వక్తలు

నిండా మునిగిన కౌలు రైతు

35 ఎకరాల చెరువు నీరు వదిలేసిన వైనం
పంట బోదెలు నిండి పొంగిపొర్లిన నీరు
తడిచి ముద్దయిన మినుమ పైరు, వరికుప్పలు
పంటకు నష్టపరిహారం చెల్లించాలని కౌలు రైతు వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

నీట మునిగిన పైరును బయటకు చేర్చుతున్న రైతు

చేపలు పట్టుబడి పట్టే క్రమంలో ఆక్వా రైతు తన చెరువులోని నీటిని ఒకేసారి పంట బోదెల సామర్థ్యానికి మించి బయటకు వదలడంతో బోదెలు నిండి నీరు పొంగిపొర్లి పనపై ఉన్న మినుము పంట నీట మునిగింది. రెండు ఎకరాల్లోని మినుము పంట నీట మునిగి గింజ ఉబ్బి మొలక రావడంతో రైతు లబోదిబోమంటున్నారు. కౌలు రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కాకరవాడకు చెందిన దళిత కౌలు రైతు గుమ్మడి రాజు రెండో పంట దాళ్వా లేకపోవడంతో మినుము సాగు చేపట్టాడు. వారం రోజుల క్రితం మినుము పైరు తీత తీశాడు. ప్రస్తుతం మినుము పైరు చేలో పనలపై ఉంది. ఈ క్రమంలో ముదినేపల్లికి చెందిన ఆక్వారైతు ఈడ్పుగంటి శ్రీనివాస్ తన 35 ఎకరాల చేపల చెరువులో చేపలు పట్టుబడికి తూముల ద్వారా చెరువులోని నీటిని గురువారం సాయంత్రం బయటకు వదిలాడు. ఈ విషయం తెలుసుకున్న కౌలు రైతు గుమ్మడి రాజు చేపల చెరువుపై కాపాలా ఉన్న వ్యక్తి వద్దకు వెళ్లి మినుము పంట చేలో ఉందని, రెండు రోజులు ఆగితే పైరును వేరే చేలో కుప్పలు వేస్తానని, అప్పటివరకు చెరువులో నీరు బయటకు వదలొద్దని చెప్పి చెరువుల తూములు కట్టేసి వచ్చాడు. అయినా ఆక్వా రైతు కౌలు రైతు మాట లెక్క చేయకుండా మళ్లీ శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో చెరువులోని నీటిని బయటకు వదిలివేయడంతో బోదెలు నిండి గట్లపై నుంచి నీరు పొంగి మినుము చేల్లోకి చేరింది. దీంతో మినుము పంట తడిచి ముద్దయింది. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న కౌలురైతు లబోదిబోమంటూ నీట మునిగిన మినుము పంటను కూలీలతో బయటకు చేర్చి కాపాడుకునే పనులు చేపట్టాడు. బడా ఆక్వారైతుల స్వార్థం వల్ల తన పంట నీట మునిగిందని కౌలురైతు రాజు వాపోతున్నాడు. పంట నీటిలో నానడంతో గింజ ఉబ్బి రంగు మారి గింజ మొలక వచ్చిందని, పంటను కొనే నాధుడే ఉండడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎకరాకు రూ.20 వేలకు పైబడి పెట్టుబడులు పెట్టినట్లు తెలిపాడు. అంతేకాక తన రెండు ఎకరాల్లో ఉన్న వరికుప్పలు కూడా మోకాలు లోతు నీటిలో ఉన్నాయన్నాడు. దీంతో వరి పంటకు నష్టం వాటిల్లుతున్నట్లు తెలిపాడు. రంగు మారిన వరి ధాన్యాన్ని ఎవరూ కొనరని వాపోయాడు. సంబంధిత అధికారులు స్పందించి నష్టపోయిన పంటకు పరిహారం ఇవ్వడంతోపాటు దీనికి కారణమైన ఆక్వా రైతుపై తగిన చర్యలు తీసుకోవాలని కౌలు రైతు రాజు అధికారులను కోరుతున్నాడు. ఈ విషయమై తహాశీల్దార్ కె.శ్రీనివాస్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు.

దుకాణాల తొలగింపు అన్యాయం

సమాచారం కూడా ఇవ్వలేదని వ్యాపారుల నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


నిరసన తెలుపుతున్న వ్యాపారులు

కనీస సమాచారం ఇవ్వకుండా వ్యాపార దుకాణాలు అడ్డగోలుగా తొలగించడం అన్యాయమని బాధిత వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక శ్రీనివాసపురం రోడ్డు బిఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో ఇటీవల మున్సిపల్ అధికారులు తొలగించిన దుకాణాల వద్ద సంబంధిత వ్యాపారులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నష్టపోయిన వ్యాపారులు మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు తమ వద్ద ఆశీలు కట్టించుకుంటున్నారన్నారు. దుకాణాల ఏర్పాటుకు లేబర్ సర్టిఫికెట్, మున్సిపల్ ట్యాక్స్ చెల్లించినట్లు తెలిపారు. అయినప్పటికీ ఉన్నపాటున పోలీస్ సిబ్బందితో వచ్చిన మున్సిపల్ అధికారులు వ్యాపారులను భయాందోళనకు గురి చేశారన్నారు. తమకు కనీసం ఒక్క రోజు కూడా గడువు ఇవ్వకుండా దౌర్జన్యం కనపర్చడం బాధాకరమన్నారు. ఒక్కొక్క వ్యాపారి సుమారు రూ.3 లక్షల అప్పులు చేసి వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటే కనీసం సమాచారం లేకుండా దుకాణాలు తొలగించడం అన్యాయమన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి నష్టపోయిన వ్యాపారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు ఆనంద్, గంగాధర్, నాగేశ్వరరావు, బి.శ్రీనివాస్, రామలక్ష్మి, జి.దుర్గారావు పాల్గొన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్‌ను వివరణ కోరగా రెండు నెలల క్రితం నోటీసులు జారీ చేశామని తెలిపారు. షాపుల యజమాని బండారు శ్రీరామకోట సత్యవతిని వివరణ కోరగా రోడ్డు మార్జిన్ ఆక్రమణలు తొలగిస్తున్నామని కనీస సమాచారం కూడా ఇవ్వలేదని చెప్పారు. గతంలో మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసిన దానిపై వివరణ ఇచ్చామని తెలిపారు. తమ వద్ద ఉన్న ఆధారాలతో కోర్టును ఆశ్రయించి స్టే తీసుకున్నామని తెలిపారు. అయినప్పటికీ రోడ్డు విస్తరణ క్రమంలో దుకాణాలు తొలగించాలని ఒక్కరోజు ముందు అయినా సమాచారం ఇచ్చి ఉంటే వ్యాపారులకు నష్టం జరిగి ఉండేది కాదన్నారు.

రూ.మూడు లక్షల అప్పు చేశాం
కిరాణా షాపు యజమాని రామలక్ష్మి

రూ.మూడు లక్షలు అప్పు చేసి కిరాణాషాపు పెట్టుకున్నాం. దుకాణంలో అవసరమైన సరుకులన్నీ కొనుగోలు చేశాం. వ్యాపారాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభించే క్రమంలో ఉన్నపాటుగా మున్సిపల్ అధికారులు జెసిబితో వచ్చి షాపులు కూల్చేశారు. షాపులో ఉన్న సరుకులు మరో చోటుకు తరలించే క్రమంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం.

ఉపాధి కోసం రాజమండ్రి నుంచి వచ్చాను
ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమాని జి.దుర్గారావు

ఉపాధి కోసం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి నుంచి వచ్చి ఆహా మన వంటిల్లు ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను ప్రారంభించాను. దీనికోసం రూ.నాలుగు లక్షల వరకు అప్పు చేశాను. వ్యాపారం ప్రారంభించిన కొన్నిరోజులకే కనీస సమాచారం లేకుండా దుకాణాన్ని కూల్చారు. ఈ క్రమంలో రెండు ఫ్రిజ్‌లు మరమ్మతుకు గురయ్యాయి. వంట, ఆహార సామగ్రి ధ్వంసమైంది.

ఏలూరు నుంచే పోటీ

మాజీ ఎంపీ మాగంటి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తాను ఏలూరు ఎంపీ స్థానానికి పోటీ చేస్తానని మాజీ ఎంపీ మాగంటి బాబు తెలిపారు. పట్టణంలోని ఓ వేడుకకు వచ్చిన ఆయన స్థానిక మండల, పట్టణ పార్టీ కార్యాలయాల్లో టిడిపి నేతలతో పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా మాగంటి బాబు విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న రౌడీ రాజకీయం ఎంతో కాలం సాగదనిఅన్నారు. ప్రతిపక్ష పార్టీగా తెలుగుదేశం ఉండకూడదనే దురుద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. కులాల మధ్య చిచ్చు పెడుతూ చేస్తున్న రాజకీయాలకు ఎంతో కాలం మనుగడ ఉండదని చెప్పారు.

అనుమతి లేని రోడ్ల నిర్మాణంపై ఆగ్రహం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం పంచాయతీ కొత్త రామయ్యపేట పునరావాస కాలనీలో అనుమతి లేని సిసి రోడ్ల నిర్మాణంపై పంచాయతీ పాలకవర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. శనివారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచి పొడుం పుష్ప, ఉపసర్పంచి కోరసిక శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు మంగిన కొండ, పట్నాల దేవి, మంగిన పోసిరత్నం, మేడుం పార్వతి మాట్లాడుతూ అనుమతి లేని సిసి రోడ్ల నిర్మాణంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. సుమారు రూ.నాలుగు లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్లు అవసరమైన ప్రాంతాల్లో నిర్మించకుండా ఎలాంటి నివాసాలు లేని ప్రాంతంలో నిర్మిస్తున్నారని సర్పంచి పొడుం పుష్ప అన్నారు. ఎస్టిమేషన్, పంచాయతీ తీర్మానాలు, అనుమతులు లేకుండా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారన్నారు. పంచాయతీ అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ రోడ్ల నిర్మాణం నిలుపుదల చేయకపోవడం పట్ల సంబంధిత కాంట్రాక్టర్‌పై, అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై సంబందిత పనులు పర్యవేక్షిస్తున్న సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది సందీప్‌ని వివరణ కోరగా పంచాయతీ పాలకవర్గ తీర్మానాలు అనుమతులు ఉన్నాయని తెలిపారు. చూపించమని కోరగా ప్రభుత్వానికి నివేదికలు పంపి వచ్చిన తర్వాత చూపిస్తామని చెప్పారు.

చెక్కపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చెక్కపల్లి గ్రామంలో కూచిపూడి లక్ష్మీనారాయణ కమ్యూనిటీ హాలు వద్ద టిడిపి మండల నాయకులు కూచిపూడి దేవేంద్ర ఆధ్వర్యంలో చింతలపూడి సాయి స్ఫూర్తి హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తల్లిబోయిన సత్యనారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షులు కాటేపల్లి ప్రసాద్, మాజీ సర్పంచి సత్యనారాయణ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు నగదు

ప్రజాశక్తి - ముసునూరు

మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామానికి చెందిన ఎన్ఎకెడి సంస్థ మేనేజర్ సిర్రా బాలకృష్ణ అన్నారు. ప్రతి ఏడాది తన పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడతారు. ఈ ఏడాది మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు రూ.పది వేలు అందించడం అభినందనీయమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బిజెపి భౌతిక దాడులు ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బిజెపి భౌతిక దాడులు చేయటం తక్షణమే ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. బుట్టాయగూడెంలో తెల్లం రామకృష్ణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఎ.రవి మాట్లాడారు. దేశంలోని మూడు రాష్ట్రాల ఎన్నికలు తర్వాత బిజెపి ప్రభుత్వం త్రిపుర రాష్ట్రంలోని సిపిఎం కార్యకర్తల ఇళ్లపై దాడులు చేస్తుందన్నారు. ఇప్పటికే 600పైగా ఇళ్లపై దాడి చేసి ధ్వంసం చేశారన్నారు. ఎలక్షన్‌లో గతం కంటే సీట్లు తగ్గాయని, ఓటింగ్ శాతం కూడా తగ్గాయని చెప్పారు. దీంతో సిపిఎం కార్యకర్తల ఇళ్లను ధ్వంసం ఏంటని ప్రశ్నించారు. భౌతిక దాడులను ఆపాలని రాష్ట్రపతికి విన్నవించారని, అయినా భౌతిక దాడులు జరుగుతూనే ఉన్నాయని చెప్పారు. మండలంలోని రెడ్డిగణపవరంలో దుర్గమ్మ ఉత్సవాల పేరుతో ఆర్ఎస్ఎస్ చొరబాటును ఖండిస్తున్నామన్నారు. గిరిజన సాంప్రదాయాలను, పద్ధతులను, సంస్కృతిని దెబ్బతీసేలా ఉత్సవాల పేరుతో ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని గిరిజనులపై రుద్దడం సరికాదన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే ఆర్ఎస్ఎస్ సంస్థల చొరబాటును దుర్గమ్మ ఉత్సవ కమిటీ ప్రోత్సహించటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తెల్లం దుర్గారావు, జీవరత్నం, అన్నవరపు సత్యనారాయణ, మడకం సుధారాణి, ఎంనాగమణి పాల్గొన్నారు.

'మానవత' కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవతా భీమడోలు శాఖకు సొంత గూడు ఏర్పడనుంది. భీమడోలు గ్రామపంచాయతీ పాలకమండలి చొరవతో మానవతా కార్యాలయ నిర్మాణానికి మూడు సెంట్ల పంచాయతీ స్థలాన్ని సర్పంచి సునీతమాన్ సింగ్ ఆధ్వర్యంలోని పాలకమండలి కేటాయించింది. కార్యాలయ నిర్మాణానికి శనివారం సర్పంచి శంకుస్థాపన చేశారు. భీమడోలుతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్న మానవతా శాఖకు సొంత నివాసం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శాఖ చేపడుతున్న సేవా కార్యక్రమంలో భాగంగా శవాల శీతలీకరణ పరికరాలు, అంతిమ సంస్కారాలను దూర ప్రాంతంలో నిర్వహించుకునే వారికి సహకరించేందుకు శాఖ సమకూర్చుకున్న శాంతి రథాలు భద్రపరిచేందుకు స్థలం లేని కారణంగా నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మానవతకు సొంత కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన మొత్తాలను సమకూర్చేందుకు సభ్యులు, దాతలు ముందుకు వచ్చారు. వీటన్నింటిపై స్పందించిన గ్రామ సర్పంచి పంచాయతీ తరపున భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్, మానవతా సభ్యులు పాల్గొన్నారు.

భీమడోలు గ్రామ సర్పంచి చొరవతో గ్రామపంచాయతీ పరిధిలోని దిగుడుపాటి దిబ్బల వద్ద ఉన్న జగనన్న కాలనీలో 89 శాతం గృహ నిర్మాణాలు ప్రారంభమై నిర్మాణాలు తుది దశలో ఉన్నాయి. గుండుగొలనులోని జగనన్న మోడల్ కాలనీలో 67 శాతం గృహ నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. వీటన్నింటి నేపథ్యంలో ఇతర కాలనీవాసులను చైతన్య పరిచేందుకు గృహ నిర్మాణ సంస్థ ఈ రెండు చోట్ల ఆర్చిల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని గృహ నిర్మాణ సంస్థ భీమడోలు సహాయ ఇంజినీర్ సతీష్ తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం భీమడోలులోని ఆర్చి నిర్మాణానికి గ్రామ సర్పంచి సునీత మాన్‌సింగ్ ప్రారంభోత్సవం చేశారు.

నాసిరకం విత్తనాలతో నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

విత్తన కంపెనీలు నాసిరకం విత్తనాలు రైతులకు ఇచ్చి మోసం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని యనమదల గ్రామంలో 200 ఎకరాల్లో సింజెంటా విత్తన కంపెనీ అందించిన సీడ్ వల్ల రైతులు నష్టపోయిన విషయం తెలుసుకున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శనివారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరానికి నాలుగు నుంచి ఐదు టన్నులు దిగుబడి వస్తుందని కంపెనీ ప్రతినిధులు రైతులను నమ్మించారు. దిగుబడి టన్నున్నరా మాత్రమే రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం స్పందించి సంబంధిత సీడ్ కంపెనీ నుంచి బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. లేకపోతే ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు నల్లిబోయిన నాని, బోనబోయిన వడ్డీకాసులు, చింతా వడ్డీ కాసులు, కొనకళ్ల తిరుపతిరావు, గంగుల అచ్చుయ్య, ఆజామర శ్రీను, బాణావతు వెంకటేశ్వరరావు, కలపాల రాజేష్ పాల్గొన్నారు.

వైసిపి విజయానికి కృషి చేయాలి : ఎంఎల్ఎ వాసుబాబు

భీమడోలు : సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజలతో మమేకమై వారి మన్ననలు పొందాలని, పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని ఎంఎల్ఎ పుప్పాల వాసు బాబు కోరారు. మండలంలోని గుండుగొలను, ఆగడాలలంక కేంద్రాలుగా వేర్వేరుగా పార్టీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఎంఎల్ఎ శనివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. వైసిపి ప్రముఖులు గుండుగొలనుకు చెందిన ముదుండి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యులు చిలుకూరి సత్యనారాయణరాజు, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగ, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు డోకల వాసంతి, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్ పాల్గొన్నారు.

14న జనసేన ఆవిర్భావ సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - నూజివీడు

జనసేన పదో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మార్చి 14వ తేదీన మచిలీపట్నంలో నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని జనసేన సమన్వయకర్తలు సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక రాయల్ గ్రాండ్ హోటల్‌లో జనసేన కార్యకర్తల సమావేశంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు చింత సురేష్, జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకష్ణ పాల్గొన్నారు.

'టిడిపితోనే యువతకు ఉపాధి'

ప్రజాశక్తి - కైకలూరు

టిడిపితోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని టిడిపి అధినేత చంద్రబాబు తెలిపారు. మండలంలోని ఆటపాక టిడిపి కార్యాలయంలో నిరుద్యోగ యువత అంశంపై టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆన్ లైన్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాగంటి వెంకటేశ్వరరావు, పోలవరపు లక్ష్మీరాణి, వెంకటరామరాజు, రామచంద్రరావు, జయ శ్యామల మాల్యాద్రి పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - పోలవరం

స్థానిక గౌతమి అతిథి గృహంలో ఈ నెల 12వ తేదీ ఆదివారం రాజమండ్రి గౌతమి నేత్రాలయ వైద్యులతో ఉచిత ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీరామశక్తి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు శ్రీను, రెడ్డి మురళీకృష్ణ, ఎస్‌విఎస్.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రెటీనా, కొయ్య కండ, కార్నియా మార్పిడి, శుక్లాలు నీటి కాసులు, మెల్లకన్ను సమస్యలకు, ఆరోగ్యశ్రీ, తెల్లరేషన్ కార్డులు ఉన్నవారికి ఉచితంగా పరీక్షలు, ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గణపవరంలో ఫీవర్ సర్వే

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.సంతోష్‌నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరికైనా దగ్గు, జ్వరం, ముక్కు నుంచి నీరు కారడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆసుపత్రి కేంద్రం వద్దకు వచ్చి వైద్యం పొందాలన్నారు. సిహెచ్ఒ జె.విల్సన్‌బాబు మాట్లాడుతూ గ్రామ సర్పంచుల సహకారంతో ప్రతి గ్రామంలో స్థానికులకు దగ్గు, జ్వరం నివారణకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహించినట్లు గ్రామ కార్యదర్శులు డి.రామారావు, స్రవంతి చెప్పారు.

CHANGE OF NAME

I, KOMANDURU DANIEL ARAVINDAM, S/o. Komanduru Aravindam, D.No. 11-6-39, Gandhi Nagar-2, Narasapuram-534275, WG.Dt. A.P. I have changed my name from KOMA NDURI DANIEL ARAVINDAM (Old Name) to KOMANDURU DANIEL ARAVINDAM (new name). Hence after all my Documents and correspondence will be countinue with my New name KOMANDURU DANIEL ARAVINDAM.

దస్తావేజులు పోయినవి

మా క్లయింటు అయిన సత్తెనపల్లి పద్మ, వెంకటాపురం గ్రామ పంచాయితీ, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా వారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం ఏలూరు మండలం, ఏలూరు నాన్ మున్సిపల్ ఏరియా, వెంకటాపురం గ్రామ పంచాయితీ, బ్లాక్-2 గ్రామంలోని ఆర్.యస్.నెం. 768, 771 ర్లు దాఖలా ప్లాటు నెం. 151 రు దాఖలా చ.గ.111-0-0లు స్థలమున్నూ, యిందలి డోరు నెం. 5-86రు గల ఆర్.సి.సి. డాబా బిల్డింగు వగైరా ఆస్తి మా క్లయింటు పేర ఏలూరు ఆర్.వో.లో దస్తావేజు నెం. 12437/2006 రుగా రిజిష్టరు కాబడినది.

సదరు నెం. 12437/2006 రు గల ఒరిజినల్ క్రయదస్తావేజు రిజిస్ట్రారు ఆఫీసు రోడ్డు, ఎన్.ఆర్. పేట, ఏలూరు మార్గంలో పడిపోయినవి. సదరు ఒరిజినల్ క్రయ దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కి తెలియపర్చగలరు.

Tigiripalli Subbarao, Advocate, Eluru
Cell : 94400 20815

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావత్తు ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన కోనేరు విద్యాధరరావు, తండ్రి : వెంకట రామయ్య అనువారు నాకు అందించిన సమాచారం మేరకు ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింట్ తాడేపల్లిగూడెం శ్రీ గౌరవ అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టు నందు జరుగుచున్నటువంటి C.C102/2022 అను NI ACT చెక్ కేసు విషయమై దాతలు చేసిన కంప్లయింట్ నందు ముద్దాయి అయినటువంటి శ్రీమతి సుంకర అలియాస్ మరాదాని గంగారత్నం, భర్త : లేటు రామచంద్రరావు అనువారు ముద్దాయిగా ఉండి పైన తెలిపిన NI ACT చెక్ కేసు నందు నోటీసులు పుచ్చుకోకుండా కాల యాపన చేయున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం వారు తీసుకోవలసినటువంటి నోటీసులను పేపరు పబ్లికేషన్ ద్వారా ఆర్డరు ఇచ్చి యున్నందున సదరు నోటీసులను ఈ పేపరు పబ్లికేషను ద్వారా తెలియజేయడమైనది. పైన తెలిపిన కంప్లయింట్ ది.29.03.2023 నాటికి పై ముద్దాయి హాజరు కొరకు వాయిదా పడియున్నందున ముద్దాయి ది.29.03.2023న తాడేపల్లిగూడెం అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని మరియు ఏదైనా అర్హత కలిగిన వ్యక్తి ద్వారా హాజరు కావాల్సిందిగా తెలియజేయడమైనది. మీరు హాజరు కాకుండా గజస్తు చేసిన యెడల శ్రీ కోర్టు వారు తీసుకోబోవు తదుపరి చర్యలకు బాధ్యులు కాగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

స్థలం : తాడేపల్లిగూడెం   తేది : 11.03.2023

ఇట్లు : మాకా శ్రీనివాసరావు, (అడ్వకేట్)
తాడేపల్లిగూడెం. సెల్ : 9848027853

సేల్ నోటీసు

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

F.D.I.A.No. 85/2023
in O.S.No. 226/2012

బిట్వీన్:

చిట్టూరి సత్యనారాయణ, తండ్రి: జగ్గారావు, పురుషుడు, వయసు 80 సం॥లు, ప్రాపర్టీస్, చెబ్రోలు గ్రామం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా.
...పిటీషనరు /వాది

మరియు

మారిశెట్టి మాణిక్యాలరావు, తండ్రి: మణిరాజు, పురుషుడు, వయసు 50 సం॥లు, ప్రాపర్టీస్, చేబ్రోలు గ్రామం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా.
...రెస్పాండెంటు /ప్రతివాది

పై నెంబరు ఫైనల్ డిక్రి పిటీషను షెడ్యూలు దాఖలు ఆస్తిని శ్రీ కోర్టు వారు **ది.27-03-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు వేలం వేయుదురు.** సదరు ఆస్థి వేలం పిటీషనరు /వాదికి చెల్లించవలసిన తనక బాకీ నిమిత్తం రెస్పాండెంటు /ప్రతివాదికి చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి వేలం వేయబడుచున్నది. కావున ఆసక్తి కలవారు శ్రీ కోర్టు వారి ఎదుట సదరు వాయిదా రోజున హాజరు కావలసిందిగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, చేబ్రోలు పంచాయితీ మరియు గ్రామం, గ్రామ కంఠం, ఆర్.ఎస్.నెం. 122/2, స్థలం 60 చ॥గ॥ ఇందులో గల ఆర్.సి.సి. బిల్డింగు, పాత తలుపు నెం.4-30, కొత్త తలుపు నెం.7-153, కరెంటు సర్వీసు నెం.588 ఈదిగువ హద్దులు మధ్య: **తూర్పు:** ఉమ్మడి దారి. **దక్షిణం:** వంకాయల సత్యం గారి గోడ. **పడమర:** రోడ్డు. **ఉత్తరం:** బోడెపు రాంబాబు, ఈ ఆస్థికి మధ్య గోడ.
పై హద్దుల మధ్య 60 చ॥గ॥ స్థలం ఇందులో గల ఆర్.సి.సి. బిల్డింగు సర్వం సహా.

పి.వేణుగోపాల చౌదరి
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 93469 60767